మూడు కి.మీ. వెళితేనే రేషన్

- కాలనీలకు దూరంగా రేషన్ షాపులు
- సరిగా పనిచేయని సర్వర్లు
- పనులు మానుకుని గంటల తరబడి క్యూలోనే


కాచవరం ఇందిరమ్మ కాలనీకి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించి రేషన్ డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సరుకుల కోసం నరక యాతన పడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు శివారు కాలనీల ప్రజలు కిలో మీటర్ల మేర నడిచి వచ్చి రేషన్ సరుకులు తీసకోవాల్సి వస్తోంది. ఎండీయూ వాహనాలను నిలిపి వేయడంతో డీలర్ల వద్దకు కార్డుదారులు వెళుతున్నారు. రేషన్ షాపుల్లో సర్వర్ మొరాయించడంతో గంటల కొద్దీ క్యూలో ఎదురు చూడాల్సి వస్తోంది. మండలంలోని 48 దుకాణాల్లో 27,064 మంది కార్డుదారులు ఉన్నారు. రేషన్ బియ్యం కోసం ఆటోలకు రూ.50 నుంచి రూ.100 వరకు ఖర్చు చేస్తున్నారు.

పనులు మానుకుని ..

కొండపల్లి, కొటికలపూడి, కాచవరం, జూపూడి, దాములూరు, మూలపాడు గ్రామాల్లో ఇందిరమ్మ కాలనీలు గ్రామాలకు సుమారు 2 నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. వీరంతా రేషన్ దుకాణాలకు వెళ్లాలంటే సుమారు 2, 3 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. కొందరు చార్జీలు వెచ్చించి ఆటోల్లో బియ్యం తెచ్చుకుంటున్నారు. కాచవరం ఇంది రమ్మ కాలనీ రేషన్ డీలర్ షాపునకు సుమారు 3 కిలో మీటర్ల దూరం ఉంది. ఆటో సదుపాయం కూడా లేకపోవడంతో ఒంటిరి మహిళలు, వృద్ధులు రేషన్ కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

అవినీతిమయంగా డీలర్ వ్యవస్థ

జూన్ ఒకటిన రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వ బియ్యం పంపిణీ ప్రారంభిస్తే జూన్ మూడో తేదీన ఇబ్రహీంపట్నంలో ఓ రేషన్ షాపు వద్ద నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. జూన్ 4న ఇబ్రహీంపట్నం ఆరో నంబర్ రేషన్ షాపు యజమాని లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు సేకరించి నగదు పంపిణీ చేశారు. రేషన్ బియ్యం పక్కగదిలో నిల్వ ఉంచారు. పౌర సరఫరాల శాఖ అధికారులు డీలర్ షాపుపై దాడి చేసి 600 కిలోల మిగులు బియ్యం ఉన్నట్లు గుర్తించి షాపును సీజ్ చేశారు.

గత ప్రభుత్వంలో ఇంటి వద్దే రేషన్ పంపిణీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టింది. గ్రామ స్థాయి అధికారుల ద్వారా ఏ రోజు ఏ వీధికి వాహనం వస్తుందో ముందుగానే సమాచారం ఇచ్చేవారు. ప్రతి వీధికి వాహనం వెళ్లి లబ్ధిదారుల ఇంటి వద్దనే బియ్యం పంపిణీ చేసేవారు. వాహనం వద్ద బియ్యం తీసుకుని నాలుగైదు అడుగుల్లో ఇంటిలోకి వెళ్లేవారు. బియ్యం పక్కదారి పట్టకుండా జీపీఎస్ విధానం వాహనంలో ఉండేది. ఇప్పుడు వాహనాలను రద్దు చేయడంతో రేషన్ డీలర్ల వద్ద లబ్ధిదారులు బారులు తీరాల్సి వస్తోంది. గ్రామం మొత్తం ఒకే డీలర్ వద్దకు చేరుకోవడంతో రద్దీ ఏర్పడి గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. డీలర్ల వ్యవస్థ కంటే వాహనాలతో ఇంటి వద్ద బియ్యం పంపిణీ విధానం బాగుందని కార్డుదారులు చెబుతున్నారు.

బియ్యం తెచ్చుకునేందుకు రూ. 100 ఖర్చు



బియ్యం కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ షాపునకు వెళ్లాల్సి వస్తోంది. బియ్యం, పంచదార తప్ప ఏమీ ఇవ్వడం లేదు. ఆటోకు రానుపోను రూ.100 ఖర్చు చేయాల్సి వస్తోంది. వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తేనే బాగుంటుంది.

– ఉప్పుతల కనకమ్మ, ఇందిరమ్మ కాలనీ, కాచవరం

ఇంటి వద్దే ఇవ్వాలి



కాచవరం సత్యనారాయణపురానికి కిలోమీటర్ల దూరంలో రేషన్ దుకాణం ఉంది. మా గ్రామం నుంచి సరుకులకు రావాలంటే ఇబ్బందిగా ఉంది. సరుకులకు వెళితే ఒక పూట పోవాల్సిందే. రేషన్ కోసం ఇబ్బందులు పడుతున్నాం. పాత పద్ధతిలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి.

– గుండెబోయిన పద్మ, సత్యనారాయణపురం, కాచవరం

క్లుప్తంగా

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం



తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 23 సెషన్స్‌లో 3,450 మంది అభ్యర్థులను తమ పరీక్షా కేంద్రానికి కేటాయించారని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావద్దని సూచించారు. ఈ నెల 30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. డిపార్టుమెంటల్ అధికారిగా బి. వీరభద్రరావును నియమించారు.

మలేరియాపై అవగాహనా ర్యాలీ

ఇబ్రహీంపట్నం: పరిసరాల పరిశుభ్రతతో మలేరియా వ్యాధిని నియంత్రించవచ్చని ఇబ్రహీంపట్నం సబ్ యూనిట్ మలేరియా అధికారి బీజీ అప్పారావు అన్నారు. ఇబ్రహీంపట్నం పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవ అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఫ్రై డేని డ్రై డేగా పాటించాలని సూచించారు. నివాస పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయకుమార్, పలువురు ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పని గంటల పెంపును నిరసిస్తూ ధర్నా



తిరువూరు: అసంఘటిత కార్మికుల పని గంటలను రాష్ట్ర ప్రభుత్వం పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తిరువూరు బోస్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, గతంలో ఉన్న కార్మిక చట్టలను అమలు చేయాలని, రోజుకు 8 గంటలు మాత్రమే పని గంటలుగా నిర్ణయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా కార్మికులు రాత్రి వేళల్లో కూడా పని చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని, ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు బలగాని వెంకటేశ్వరరావు, ఎం. నాగేంద్రప్రసాద్, సీఐటీయూ నాయకులు ఆకుల రవి, పంతంగి శ్రీనివాసరావు, సాంబారు వెంకటేశ్వర్లు, గుళ్లపల్లి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ వర్మ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఎన్టీటీపీఎస్ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన యోగాభ్యాసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయని చెప్పారు. అనంతరం యోగా గురువు లంకే జనార్దన్ 300 మంది రక్షక దళ సిబ్బందిలో సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ప్రాణాయామం సాధన చేయించారు. ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వెంకటరామిరెడ్డి, సీఈ శివ రామాంజనేయులు, జోన్ కమాండెంట్ శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్దలతో సీఐ సమావేశం

నూజివీడు: బక్రీదు పర్వదినాన్ని శాంతియుత వాతవరణంలో నిర్వహించుకోవాలని పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ముస్లిం మత పెద్దలతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు ఒకరికొకరు సోదర భావంతో మెలుగుతూ ముందుకు సాగాలన్నారు. మైలవరం రోడ్డులోని ఈద్గా వద్ద ఉదయం ప్రార్థలు నిర్వహించే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా క్రమ శిక్షణతో ఉండాలన్నారు. ముస్లిం సంఘం నాయకులు షేక్ మున్నీ, మత పెద్దలు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

తిరువూరు: గంపలగూడెం మండలం కొణిజెర్ల చెరువు వద్ద జూద శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, నాలుగు కోడి కత్తులు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.28,450 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

హైస్కూల్‌లో చెట్ల నరికివేత

నూజివీడు: ఒక వైపు మొక్కలు నాటి చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలంటూ ప్రభుత్వం చెబుతుండగా పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలోని అశోక చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా సగం వరకు నరికి వేశారు. హైస్కూల్ భవనం కంటే ఎత్తు ఎక్కువగా ఉండి బిల్డింగ్‌పై భాగంలో చెట్ల ఆకులు పడి నీళ్లు పోకుండా అడ్డు పడుతున్నాయంటూ సాకును చెబుతున్నారు. దీనిపై డీవైఈఓ ఎం.సేవియాను వివరణ కోరగా హైస్కూల్ బిల్డింగ్ పైభాగంలో ఆకులు పడుతున్నాయని, సగానికి నరికారని, దీనికి అనుమతులు అక్కర్లేదని చెప్పారు.

వ్యాయామోపాధ్యాయుల బదిలీ

నూజివీడు: నియోజకవర్గంలోని పలు మండలాల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయు (పీడీ)లు బదిలీ అయ్యారు. ముసునూరు హైస్కూల్ పీడీ ఎండీ అలీఖాన్ నూజివీడు బాలికల హైస్కూల్ ప్లస్‌కు, మైలవరం జెడ్పీ బాలికల హైస్కూల్ పీడీ మంజుల వాణి నూజివీడులోని కోటవారిగూడెం హైస్కూల్‌కు, మీర్జాపురం హైస్కూల్ పీడీ పి.స్వప్న పట్టణంలోని బాలికల హైస్కూల్ ప్లస్‌కు, చాట్రాయి మండలం మర్లపాలెం హైస్కూల్ పీడీ డి.సతీష్‌కుమార్ నూజివీడు మండలం యనమదల హైస్కూల్‌కు, గొల్లపల్లి హైస్కూల్ పీడీ పి.రవీంద్ర అన్నవరం హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. అలాగే నూజివీడు బాలికల హైస్కూల్ ప్లస్ పీడీ కె.రాణి పోతురెడ్డిపల్లి హైస్కూల్‌కు, చాట్రాయి మండలం చిత్తపూర్ పీడీ కె.ప్రభాకర్ ముసునూరు మండలం గోపవరం హైస్కూల్‌కు, ఎస్ఆర్ఆర్ హైస్కూల్ పీడీ వాకా వనజ దిగవల్లి హైస్కూల్‌కు, దిగవల్లి హైస్కూల్ పీడీ కె.రాజేంద్రప్రసాద్ గొల్లపల్లి హైస్కూల్‌కు, యనమదల హైస్కూల్ పీడీ టీవీ నాగేశ్వరరావు మీర్జాపురం హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ముసునూరు మండలం వేల్పుచర్ల హైస్కూల్ పీడీ బి.సుకుమార్ పల్లెర్లమూడి హైస్కూల్‌కు, నందివాడ మండలం పోలుకొండ హైస్కూల్ పీడీ బాల భాస్కర్ చెక్కపల్లి హైస్కూల్‌కు, బాపులపాడు హైస్కూల్ పీడీ పామర్తి వెంకటేశ్వరరావు వేల్పుచర్ల హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. బదిలీ అయిన పీడీలకు నూజివీడు సబ్ జోన్ అధ్యక్షురాలు లక్ష్మీ, సెక్రటరీ సుగుణరావు అభినందనలు తెలిపారు.

మూడు రోజులుగా అంధకారంలోనే..

ఆగిరిపల్లి: స్థానిక నూజివీడు రోడ్డులోని చింత చెట్టు సెంటర్ నుంచి హైస్కూల్ రోడ్డు వరకు గత మూడు రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చీకట్లోనే ప్రజలు రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాఖా గ్రంథాలయంలో నెల రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ సర్జన్ మామిడి సీతారామారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వర రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేందుకు వేసవి శిక్షణా శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. శిబిరాల్లో పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్ర లేఖనం, వ్యాస రచన, చెస్, క్యారమ్స్ తదిర అంశాలపై శిక్షణ ఇచ్చామని గ్రంథాలయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.


నూజివీడులో సర్టిఫికెట్లతో విద్యార్థులు


మైలవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సురేష్‌బాబు తదితరులు

విజేతలకు బహుమతుల ప్రదానం

మైలవరం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ టి. సాంబశివరావు అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఆయన మాట్లాడారు. అనంతరం శిక్షణా శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ముఖ్య అతిథులచే బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టి. సురేష్‌బాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠకులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించడంతో పాటు అనేక మంది ప్రముఖుల జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందజేశారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండంలోని చనుబండ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి శ్రీకాంత్, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఇంగ్లిష్ గ్రామర్, తెలుగు పద్యాలు, క్రాఫ్ట్ డ్రాయింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వీరంకి గోపాలరావు, ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి జయరాజు బహుమతులు అందజేశారు.

నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో మోసం

తిరువూరు ఆర్డీఓకు కొండపర్వ కౌలుదారుల ఫిర్యాదు


తిరువూరు ఆర్డీఓ మాధురికి వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతులు

తిరువూరు: ఓ ప్రైవేట్ కంపెనీ మొక్కజొన్న సీడ్స్ సరఫరా చేసిన విత్తనాలతో గత రబీ సీజన్‌లో వేసిన పంటలు పండక నష్టపోయామని, కంపెనీపై తగు చర్యలు తీసుకుని తమకు పూర్తి నష్ట పరిహారం అందజేయాలని విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామానికి చెందిన కౌలుదారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తిరువూరు ఆర్డీఓ కె. మాధురిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

రసీదులు కూడా ఇవ్వలేదు

ఈ సందర్భంగా కౌలుదారులు మాట్లాడుతూ ఎకరాకు 4, 5 టన్నుల దిగుబడి వస్తుందని, టన్నుకు రూ.30 వేలు ఇస్తామని నమ్మించి కంపెనీ ప్రతినిధులు రశీదు ఇవ్వకుండా విత్తనాలు అంటగట్టారని, సుమారు 40 ఎకరాల్లో సాగు చేసిన మొక్క జొన్న దిగుబడి కనీసమాత్రం కూడా రాలేదని వాపోయారు. తమకు జరిగిన నష్టాన్ని కంపెనీ ప్రతినిధులకు తెలపగా, పంట ఫొటోలు తీసుకెళ్లారని, పదే పదే అడగగా, దిగుబడిని తమ కంపెనీకి విక్రయిస్తే పూర్తిస్థాయిలో సొమ్ము చెల్లిస్తామని నమ్మబలికారని, 20 రోజుల్లో డబ్బు వేస్తామని చెప్పారన్నారు. పంట దిగుబడి అప్పజెప్పి నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కంపెనీ ప్రతినిధులను గట్టిగా నిలదీయగా విత్తనాల కొనుగోలు రశీదులు తీసుకు రావాలని, లేకుంటే పరిహారం ఇవ్వబోమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్తి పరిహారం ఇప్పించాలి..

తమకు నాసిరకం విత్తనాలు అంటగట్టడమే కాక రశీదు ఇవ్వకుండా, దిగుబడిని కొనుగోలు చేస్తామని నమ్మించి సొమ్ము చెల్లించక పలు రకాలుగా మోసగించిన కంపెనీపై చట్టప్రకారం చర్యలు తీసుకుని తమకు పూర్తి పరిహారం ఇప్పించాలని కౌలుదారులు ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నాగ రాజు, రైతు సంఘం జిల్లా నాయకుడు ఆలీబాబా, కౌలుదారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు నష్ట పరిహారం అందజేత

నూజివీడు: మండలంలోని బోర్వంచలో సీడ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు మొక్కజొన్న కంపెనీకి చెందిన ఆర్గనైజర్లు శుక్రవారం నష్ట పరిహారం అందజేశారు. గ్రామానికి చెందిన 30 మంది రైతులు రబీలో 68 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్నను సాగు చేశారు. మొక్కజొన్న సరిగా పండకపోవడంతో కంపెనీ చెప్పిన విధంగా దిగుబడి రాక రైతులు నష్టాల పాలయ్యారు. ఈ నేపథ్యంలో సీపీఐ నాయకత్వంలో ఆందోళన చేయడంతో కంపెనీ దిగి వచ్చి రైతులకు నష్ట పరిహారం అందజేసేందుకు ముందుకొచ్చింది. దీనిలో భాగంగా పట్టణంలోని అమర్ భవన్‌లో సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకట రామారావుల సమక్షంలో ఆర్గనైజర్లు రూ.22.70 లక్షలు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మగడ్డ నరసింహ, రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేంద్రరావు, సీడ్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.


బోర్వంచ రైతులకు నష్ట పరిహారం చెక్కులను అందజేస్తున్న సీడ్ కంపెనీ ఆర్గనైజర్లు

యుద్ధప్రాతిపదికన గండ్లను పూడ్చాలి

వైఎస్సార్ సీపీ నాయకుల డిమాండ్



విజయవాడరూరల్: గత ఆగస్టు నెలలో బుడమేరు వరదల కారణంగా నల్లవాగు, చిల్లవాగు, తాడేపల్లి వాగు సమీపంలో బుడమేరకు పడిన గండ్లను, తారకరామ ఎత్తిపోతల పథకం కాల్వకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మంద జక్రధరరావు డిమాండ్ చేశారు. కొత్తూరు తాడేపల్లి వాగు సమీపంలో బుడమేరు కాల్వకు పడిన గండ్లు, వరదలకు దెబ్బతిన్న రైతు చెరుకూరి సాంబశివరావు పొలాన్ని, ఇతర గండ్లను వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా ఇంతవరకు గండ్లను పూడ్చకపోవడం రైతులపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను తెలియజేస్తోందన్నారు. వరదలకు రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. బుడమేరు రెగ్యులేటర్ నుంచి ప్రవహించే బుడమేరు వాగుల కట్టలను బలోపేతం చేయాలని, కాల్వల్లో వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కవులూరు సర్పంచి కొండా మరియమ్మ, కవులూరు ఉప సర్పంచి బొర్రా నరేంద్ర, డొక్కా వెంకటరత్నం, బెజవాడ వీరయ్య, గంధం శ్రీనివాసరావు, ఈలప్రోలు నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, బయ్యారపు కిశోర్, పరికెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ లంకా నిర్మల

చాట్రాయి: గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ లంకా నిర్మల అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారుల సమీక్షా సమావేశంలో భాగంగా జీలుగ విత్తనాలు కొరతగా ఉందని, కొంత మంది కౌలు రైతులకే రుణ అర్హత కార్డులు అందుతున్నాయని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి సభకు వివరించగా అర్హత కలిగిన కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇస్తున్నామని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. వేసవిలో కొత్తగా బోర్లు వేయించుకున్న రైతులకు వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. పండ్ల మొక్కలు, పామాయిల్ మొక్కలు రైతులకు ఉచితంగా సరఫరా చేస్తామని ఉద్యానవన శాఖాధికారి హేమ సభకు వివరించారు. చనుబండలో నూతనంగా మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతారని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి అడగ్గా టెండర్లు పిలిచినా ఎవరూ రావడం లేదని ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు తెలిపారు. ఎంపీడీఓ ఐ.విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్ సూపరింటెండెంట్ కమల విష్ణు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

జి.కొండూరు: కవులూరు గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డుని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు ఈ రహదారిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సర్పంచ్ కొండా మరియమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, నాయకులు బెజవాడ వీరయ్య, చెరుకూరి శ్రీనివాసరావు, బొర్రా నరేంద్ర పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన వక్ఫ్‌బోర్డు సభ్యుడు అక్రమ్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్ అక్రమ్ కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షాబూఖారీ బాబా దర్గాను శుక్రవారం సందర్శించారు. బాబా వారికి పూలు, చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ముజావర్లు అక్రమ్‌ను సన్మానించారు. అక్రమ్ మాట్లాడుతూ షాబూఖారీ దర్గాలో బాబాను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అల్లాహ్ దయ, బాబావారి దీవెనలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి

నూజివీడు: పట్టణ పరిధిలోని టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరుతూ సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ లబ్ధిదారులు పేదలని, కూలి పనులు చేసుకుంటూ అద్దె ఇళ్లల్లో జీవనం సాగిస్తున్నారని, వీరు అప్పులు చేసి డబ్బులు చెల్లించారన్నారు. దీనికి తోడు టిడ్కో గృహాలకు తీసుకున్న రుణాలకు సంబంధించి ఈఎంఐలు చెల్లించమని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పల్లె ప్రేమ్‌కుమార్, పి. ప్రవీణ్, పీఏసీఎస్ నాయకులు ఒగ్గు ముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు.


నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఎన్ఎంఎంఎస్‌కు చెక్కపల్లి విద్యార్థి ఎంపిక

ముసునూరు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ 2024 ఎగ్జామ్‌లో తమ పాఠశాల ఏడో తరగతి చదివిన విద్యార్థి బట్టు జోవియల్ అర్హత సాధించిందని చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అల్లాభక్షు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి జోవియల్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.